రాగం :

తాళం :

రచన :

సంగీతం :

గానం :

# 145. పసితనం

ప॥ పారేసుకు వచ్చావా! పసిడి కదా! పసితనం

ఏమున్నది ఎదిగిపోతే నిరంతరం చింతనం

వయసొక్కటె లెక్కించకు జీవితాన నేస్తమా!

అవధిలేని ఆనందం అసలుసిసలు కొలమానం ॥పారేసుకు॥

చ॥1 అమ్మచేతి గోరుముద్ద ఆమడదూరం జరిపి

నాన్న కసురుతుంటే ఆ కడ కొంగును తడిపి

ఆ ముద్దు ముచ్చట్లను ఎక్కడ వదిలేశావో

గతంలోన వెతికిచూడు నీ జ్ఞాపకాలు కదిపి ॥పారేసుకు॥

చ॥2 గూటిలోని తాయిలాన్ని గుటుక్కుమని మింగేసే

తలుపు చాటునున్న అక్క మొట్టికాయ నొకటిస్తే

బడికిపోని మారాముకు ఎన్ని ఎన్ని సాకులు

చిలిపి పనుల జాడలే, ఆ నిన్నలు తిరగేస్తే ॥పారేసుకు॥

చ॥3 తరు శాఖను వసంతాలు జారిపోవు కరణి

తనువు విడుచు శైశవం తిరిగిరాదు మళ్ళీ

బాల్యమంటె చిన్నతనం కాదు కాదు తెలుసునా!

కొనగలవా! కరగిపోతే కోట్లైనా పోగేసి ॥పారేసుకు॥